చిన్నమాట

కథ అందరికీ నచ్చే సాహిత్య ప్రక్రియ. బాల్యం నించే మనిషికి కథలంటే ప్రీతి. అందుకే తెలుగులో వార, మాసపత్రికల్లో కథలు తప్పనిసరి. ఆఖరికి ఆదివారం అనుబంధాల్లో కూడా. కథా సరిత్సాగరం, కాశీ మజిలీ కథలు, పంచతంత్రం కథలు.... ప్రతి సంస్కృతికీ ఇలాంటి కథలున్నాయి. తెలుగు కథల నేపథ్యానికి విస్తృతి లేదు. ఈనాటికీ అవి ఎదగలేదు. ప్రేమ, కుటుంబం, జానపదం, హాస్యం, ఇంకా ఆఫీసు కథలు, కమ్యూనిస్ట్ కథలు, తెలుగు కథలు ఇలా కేవలం పరిమిత ఇతివృత్తాల చుట్టూనే తిరుగుతున్నాయి.

కమ్యూనిజం, స్త్రీవాదం, దళితవాదం కథలని అతి గొప్ప కథలుగా చలామణి చేసే ప్రయత్నం కొన్ని పదుల సంవత్సరాలుగా జరుగుతోంది. కథల పోటీల్లో అవార్డులుకూడా ఈ కథలకే వస్తూండడం కూడా మనం గమనించవచ్చు. ఈ మధ్య యువరచయితలనుంచీ స్వలింగ సంపర్కం లాంటి జుగుప్సాకరమైన కథలు కూడా వస్తున్నాయి.

తెలుగులో 1950-1960లలో వెలువడ్డ కథలు ఈనాటికీ గుర్తుండిపోయే మంచి కథలు. ఆనాటి రచయితలు ఏ వాదానికీ కట్టుబడకుండా మానవ జీవితాల్లోని సున్నిత అంశాలతో కథలు రాసారు.

విదేశాల్లో, ముఖ్యంగా అమెరికా, యూరప్‌లలో కథా ఇతివృత్తం ఎంతో విస్తృతమైందని వారి పత్రికలు చదివాక నాకు అర్థమైంది. విపుల మాస పత్రిక ఆరంభించినప్పటినించి నేను వాటిని తెలుగులో అనువదిస్తున్నాను.

చిన్నప్పటినించి నాకు క్రైం కథలంటే ఇష్టం. ఆ రకం కథల ఇతివృత్తాలు కూడా ఎంతో విస్తృతమైనవి. హత్య, పరిశోధనే కాకుండా లాక్డ్ రూమ్ మిస్టరీస్, పజిల్స్, అతీంద్రియ కథలు, ట్విస్ట్ కథలు, హాస్యం, చరిత్ర, జానపద నేపథ్యం, కిడ్నాపింగ్, పగ, ప్రతీకారం, బ్లాక్ మెయిలింగ్ కథలు ఇంకా కిరాయి హంతకులు, వృద్ధులు, పిల్లలు, జంతువులు ప్రధాన పాత్రలుగాగల కథలు, రోడ్ కథలు, హృదయాన్ని స్పందింపచేసే కథలు... ఇలా వాటిలో ఎన్నో డివిజన్స్ ఉన్నాయి.

అలాంటి కథలని తెలుగు పాఠకులు ఈ నెలనించి కౌముదిలో నెలకి ఒకటి చదవగలరు. తెలుగు కథా వీధుల్లో లభ్యం కాని ఈ వినూత్న కథలు మిమ్మల్ని ఆనందింప చేస్తాయని ఆశిస్తూ ...

మీ మల్లాది వెంకట కృష్ణమూర్తి.

సింహం మనిషి

రచన: జాక్ లండన్

అతని పేరేమిటో కాని అంతా అతన్ని చిరుతపులి మనిషి అని పిలుస్తారు. వందలమంది ప్రేక్షకుల ముందు ఓ బోనులోకి వెళ్ళి, చిరుతపులుల మధ్య నిలబడి వాటితో అనేక పనులని చేయిస్తూ ప్రేక్షకుల్ని థ్రిల్ చేయడం అతని ఉద్యోగం. సర్కస్ యజమాని అతనికి అందుకు హెచ్చు జీతమే ఇస్తాడు.

అతన్ని చూస్తే అలా అనిపించదు. సన్నగా, రివటలా, బలహీనంగా కనిపించే అతను మృదుస్వభావి. ఓ గంట నించి నేను అతన్నించి ఏదైనా ఆసక్తి గల సమాచారాన్ని లాగాలని ప్రయత్నిస్తూ విఫలం అవుతున్నాను. వచ్చే ఆదివారం అనుబంధానికి నేనో ఆర్టికల్‌ని రాయాల్సి ఉంది. అతనికి తన పనిలో ఎలాంటి గొప్పతనం కనిపించినట్లుగా లేదు. అది సాహసవంతమైందిగా అతనికి తోచదు. ఎప్పుడూ ఒకే పని అవడం వల్ల అతనికి తన పని మీద విసుగు కూడా ఏర్పడిందని అతని మాటలని బట్టి గ్రహించాను.

సింహాలు? వాటితో అతను పోరాడాడు. ఆ సమయంలో తాగకుండా ఉండాలని చెప్పాడు. ఎవరైనా ఓ సింహాన్ని ఓ సాధారణ కర్రతో కదలకుండా చేయగలరు. ఓసారి అతను శిక్షణలోని ఓ సింహంతో అరగంట పోరాడాడు. అది మీదకి వచ్చినప్పుడల్లా దాని ముక్కుమీద గుద్దసాగాడు. అది తెలివి తెచ్చుకుని, తల వంచుకుని వచ్చినప్పుడు కాలిని చాపాలి. అది తల ఎత్తి కాలిని పట్టుకోబోతూంటే, దాన్ని వెనక్కి లాక్కుని మళ్ళీ ముక్కుమీద గుద్దాలి. కొంతసేపటికి అది లొంగి ఆజ్ఞలని పాటించడానికి సిద్ధమవుతుంది.

అతను నాకు తన మృదువైన మాటల మధ్య ఒంటి మీది గాయాల మచ్చలని చూపించాడు. అవి చాలా ఉన్నాయి. ఇటీవల ఓ ఆడపులి అతని భుజం మీదకి పంజాని విసిరితే దాని గోళ్ళు అతని ఎముకల దాకా దిగాయి. అతని కుడి మోచేతి కింది భాగం మీద గోళ్ళు, కోరల గుర్తులు చాలా కనిపించాయి. ఐతే అవి తనని పెద్దగా బాధించవని, తనని బాధించేదల్లా వర్షాకాలం అని అతను చెప్పాడు.

అకస్మాత్తుగా ఏదో గుర్తువచ్చినట్లు అతని మొహంలోకి వెలుగు ప్రవేశించింది. నేను కోరుకునే, నా ఆర్టికల్‌కి పనికొచ్చే ఆసక్తికరమైన వివరాలని అతను చెప్తాడని అనుకున్నాను.

"ఓ సింహాల మనిషిని మరో మనిషి ద్వేషించడం గురించి మీరు విన్నారా?" అడిగాడు.

"లేదు."

అతను ఆలోచనగా ఎదురుగా బోనులో ఉన్న జబ్బుపడ్డ సింహం వంక చూసాడు.

"ఆ సింహాల మనిషి ప్రేక్షకులకి ఇచ్చే గొప్ప థ్రిల్ సింహం అతని తలని కొరకడం చూడొచ్చనే ఆశతో ప్రతీ షోకి వచ్చేవాడు. అతను ఓపికకి గొప్ప ఉదాహరణ అని మీరు రాసుకోవచ్చు. అలా ఆ ద్వేషించే మనిషి ఆ సర్కస్‌తోపాటు దేశం మొత్తం తిరిగాడు. ఏళ్ళు గడిచాయి. ఇద్దరూ వృద్ధులు కూడా అయ్యారు. చివరికి ఓ రోజు ఆ ద్వేషపూరిత వ్యక్తి కోరుకుంది జరిగింది. ఆ రోజు సింహం అతని తలని కొరికింది. తక్షణ మరణం సంభవించి, ఆ సింహాల మనిషికి డాక్టర్ అవసరం కూడా లేకపోయింది. అవీ ఓపిక, సహనాలంటే."

కొద్దిసేపాగి తన పక్కన ఉన్న మాంసం ముక్కని అందుకుని ఎదురుగా ఉన్న బోనులో వేసి మళ్ళీ తను చెప్పేది కొనసాగించాడు.

"మా సర్కస్‌లో పొడుగాటి కత్తుల్ని మింగి, కప్పులని చేత్తో ఎగరేసి అవి నేలమీద పడిపోకుండా పట్టుకునే డివిల్ అనే ఫ్రెంచ్ కళాకారుడు ఉండేవాడు. అతని భార్య ఉయ్యాల మీద ఊగుతూ చివర్లో కింద నెట్ మీదకి దూకేది. డివిల్ ముక్కోపి. అది త్వరగా ముక్కునించి చేతికి పాకేది. అది పులి పంజాలా మెరుపు వేగంతో పనిచేసేది. ఓ రోజు అతన్ని రింగ్ మాస్టర్ దేనికో తిట్టాడు. దాంతో డివిల్ ప్రేక్షకుల ముందు మృదువైన చెక్కకి అతన్ని ఆనించి, కత్తులని అతనివైపు విసిరే ఆటని ప్రదర్శించాడు. వాటిని ఎంత త్వరగా విసిరాడంటే రింగ్ మాస్టర్‌కి ఏం జరుగుతోందో ఆలోచించుకునే వ్యవధి కూడా లేకపోయింది. ఆ కత్తులు అతని దుస్తుల్లోంచి వెళ్ళి చెక్కలో దిగబడ్డాయి. కొన్ని అతని చర్మాన్ని రాసుకుంటూ వెళ్ళడంతో జబ్బలకి స్వల్ప గాయాలయ్యాయి. బఫూన్లు ఆ కత్తులని లాగి అతను బయటకి వచ్చేలా చేసారు. దాంతో డివిల్ విషయంలో జాగ్రత్తగా ఉండాలనే సంగతి అందరికీ తెలిసింది. ఫలితంగా అంతా అతని భార్యతో మాట్లాడటానికి కూడా జంకేవారు.

కాని అదే సర్కస్‌లో దేనికీ, ఎవరికీ భయపడని ఓ వ్యక్తి ఉండేవాడు. అతని పేరు వాలెస్. అతను సింహాన్ని మచ్చిక చేసే వృత్తిలో ఉన్నాడు. వాలెస్ తన తలని సింహం నోట్లో ఉంచే ప్రదర్శనని ఇచ్చేవాడు. అన్ని సింహాల నోట్లో తలని ఉంచినా అగస్టస్ అనే మంచి స్వభావం గల పెద్ద సింహాన్ని కోరుకునేవాడు. అతన్ని అంతా కింగ్ వాలెస్ అని పిలిచేవారు. అతను జీవించి ఉన్న వేటికీ జంకేవాడు కాదు. మరణించిన వాటికి కూడా.

అతను నిజంగా కింగే. ఓసారి స్వయంగా నా కళ్ళతో చూసాను. అతను పందెం కట్టి, తాగి బోనులోని రెచ్చిపోయిన సింహాన్ని దారిలోకి తేవడానికి చేతిలో కర్రలేకుండా వెళ్ళాడు. తన పిడికిళ్ళతో ఆ సింహం ముక్కు మీద కొడుతూ లొంగదీసుకున్నాడు.

చిరుతపులి మనిషి చెప్పడం ఆపి, తల వెనక్కి తిప్పి, రెండుగా విభజించబడ్డ ఓ బోనులోని కోతిని, మరోవైపున్న పెద్ద బూడిదరంగు తోడేలుని చూసాడు. అది తమ మధ్య అడ్డుగా ఉన్న ఇనప జల్లెడని విరిచే విఫల ప్రయత్నం చేస్తోంది. ఆ కోతి స్నేహితులు భయంతో అరుస్తున్నాయి. ఎవరూ కనపడకపోవడంతో అతను తక్షణం లేచి తనతో తీసుకెళ్ళిన సన్నటి కర్రతో

ఆ తోడేలు ముక్కుమీద కొట్టి దాన్ని అదుపు చేసి తిరిగి నా దగ్గరకి వచ్చి క్షమాపణగా నవ్వుతూ కూర్చుని చెప్పేది కొనసాగించాడు.

"డివిల్ భార్య కింగ్ వాలెస్ వంక తరచు చూసేది. కింగ్ వాలెస్ కూడా ఆమెని చూసేవాడు. ఇలా చూసుకోవడాన్ని డివిల్ గమనించేవాడు. డివిల్ చెడ్డవాడని మేము కింగ్ వాలెస్‌ని హెచ్చరించాం. కాని ఉపయోగం లేకపోయింది. అతను మమ్మల్ని చూసి నిరసనగా నవ్వాడు.

వాలెస్ అతనితో గొడవ పెట్టుకోవాలని ఓ రోజు డివిల్ తలని పట్టుకుని ఉడకపెట్టిన పిండి ఉన్న బక్కెట్లోకి బలవంతంగా చొప్పించాడు. డివిల్ మొహానికి అంటిన పిండిని తుడుచుకోడానికి నేను సహాయం చేసాను. ఆశ్చర్యంగా అతను కింగ్ మీదకి పోట్లాటకి వెళ్ళకుండా చాలా శాంతంగా ఉండిపోయాడు. కాని అతని కళ్ళల్లో నేను క్రూరమృగాల్లో కనిపించే క్రౌర్యాన్ని చూసాను. నేను వాలెస్‌కి చివరి హెచ్చరికని చేసాను. అతను నవ్వాడు. కాని ఆ తర్వాత అతను డివిల్ భార్యవైపు చూడటం మానేసాడు.

కొన్ని నెలలు గడిచాయి. ఏం జరగకపోవడంతో నేను అనవసరంగా డివిల్ గురించి భయపడ్డానని అనుకున్నాను. ఆ సరికి మేము శాన్‌ఫ్రాన్సిస్కోకి చేరుకున్నాం. ఓ మధ్యాహ్నం షో జరుగుతోంది. సర్కస్ టెంట్ ఆడవాళ్ళు, పిల్లలతో నిండి ఉంది. నా పాకెట్ నైఫ్‌తో వెళ్ళిన రెడ్ డెన్నీ అనే బఫూన్ కోసం నేను వెదకసాగాను.

డ్రసింగ్ టెంట్ పక్కనించి వెళ్తూ, కేన్వాస్‌కి ఉన్న ఓ రంధ్రం లోంచి అతను కనపడతాడేమోనని చూసాను. లోపల అతను లేడు. వాలెస్ కనిపించాడు. బోనులోని సింహాలతో ప్రదర్శన ఇవ్వడానికి టైట్ డ్రస్‌తో సిద్ధంగా ఉన్నాడు. అతను ట్రపీజ్ కళాకారుల మధ్య జరిగే వివాదాన్ని సరదాగా చూస్తున్నాడు. మిగిలిన వాళ్ళు కూడా ఆ వాదనని గమనిస్తున్నారు.

ఒక్క డివిల్ తప్ప. అతను వాలెస్ వంక చూసే చూపుల్లో ద్వేషం స్పష్టంగా కనిపించింది. మిగిలిన ఎవరూ డివిల్‌ని చూడలేదు. నేను మాత్రమే ఆ రంధ్రంలోంచి ఆ కళ్ళల్లోని ద్వేషాన్ని చూసాను."

అతను ఆగి ఓ గుటక వేసి మళ్ళీ కొనసాగించాడు. అతని మొహంలో భయం కనిపించింది.

"డివిల్ జేబులోంచి ఓ చేతి రుమాలుని తీసి ఓసారి దాంతో మొహాన్ని తుడుచుకుంటూ, అదే సమయంలో వాలెస్ వెనక నించి నడిచాడు. అతను క్షణకాలం కూడా ఆగలేదు. ఆ రుమాలుని వాలెస్ తలవైపు విదల్చడం నేను తర్వాత కాని గుర్తు తెచ్చుకోలేకపోయాను. ఆ గదిలోంచి బయటకి వెళ్తూ వెనక్కి తిరిగి వాలెస్ వంక చూసి వెళ్ళాడు. ఆ చూపు నన్ను ఇబ్బంది పెట్టింది. అతని కళ్ళల్లో ద్వేషమే కాక, విజయానందం కూడా నాకు కనిపించింది. అతను సర్కస్ ఆవరణలోంచి బయటకి నడిచి ట్రామ్ ఎక్కి నగరంలోకి వెళ్ళడంతో నేను ఊపిరి పీల్చుకున్నాను.

కొద్ది నిమిషాల తర్వాత నాకు రెడ్ డెన్నీ కనిపించాడు. నా పెన్ నైఫ్‌ని ఇచ్చాడు.

సర్కస్ మొదలైంది. కింగ్ వాలెస్ వంతు రాగానే అతను ఎప్పటిలా ప్రేక్షకులు ఉత్కంఠంగా, భయంగా చూసే ప్రదర్శనని ఇస్తున్నాడు. అన్ని సింహాలు చిన్నగా అరుస్తూ అటూ, ఇటూ తిరుగుతున్నాయి. కాని అగస్టస్ మాత్రం బద్ధకంగా, శాంతంగా కూర్చుని ఉంది. చివరికి వాలెస్ అగస్టస్ కాళ్ళ మీద కొరడాతో కొట్టి దాన్ని లేపి సరైన పొజిషన్లో నించోపెట్టాడు. అతని సిగ్నల్ ఈలని వినగానే అది విధేయతగా నోటిని తెరిచింది. వాలెస్ ఎప్పటిలా ప్రేక్షకులకి అభివాదం చేసి తన తలని దాని నోట్లో ఉంచాడు. ఎప్పుడూ జరగనిది జరిగి, వెంటనే దాని దవడలు మూసుకున్నాయి. చాలామందికి ఎముకలు పెళపెళమన్న శబ్దం వినిపించింది."

చిరుతపులి మనిషి సన్నగా నవ్వాడు.

"దాంతో కింగ్ వాలెస్ చరిత్ర ముగిసింది. గొడవంతా తగ్గాక నేను ముందుకి వంగి వాలెస్ తలని వాసన చూసాను. వెంటనే తుమ్మాను."

"అది...అది..." నాకు సమాధానం తట్టినా చెప్పకుండా అతని జవాబు కోసం ఆగాను.

"అవును. ముక్కుపొడుం. డివిల్ వెళ్తూ వాలెస్ తల మీద చల్లిన ముక్కుపొడుం వాసన అది. అగస్టస్ అంతా అనుకున్నట్లుగా తప్పేం చేయలేదు. ఊరికే తుమ్మింది...అదే అగస్టస్."

తల తిప్పి బోనులోని జబ్బుగా ఉన్న ఆ సింహం వంక చూసాను.

(వచ్చేనెల మరో కథ)

COMMENTS